సాక్షి
కామారెడ్డి
మంగళవారం, 22, ఏప్రిల్, 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 108 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో భూ సంబంధిత ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి.

- 8లో ▸



పట్టుదల ఎక్కువ

గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులకు పట్టుదల ఎక్కువని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
43.0 /23.6

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



వేదికపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి, సలహాదారులు పోచారం, షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు, కలెక్టర్లు హన్మంతు, సంగ్వాన్

రైతు ప్రయోజనాలే పరమావధి

- సాగుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి
- ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలి
- రైతులకిచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- అట్టహాసంగా ప్రారంభమైన రైతు మహోత్సవం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్టాళ్లు
- ఐదు జిల్లాల నుంచి తరలివచ్చిన రైతులు



సుభాష్‌నగర్: రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలే పరమావధి అని, ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతాంగానికి ఇచ్చిన ప్రతి హామీ అమలు కోసం పని చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రైతు మహోత్సవం కార్యక్రమం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటుచేసిన సభలో తుమ్మల మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం చేయాలని, సాగుకు ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించేలా మెళకువలు అందించేందుకు రైతుమహోత్సవం ఎంతగానో ఉపకరిస్తుందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర దేశాల్లో సాగు చేసే పంటలు, ఆధునిక సాగుపై మూడురోజులపాటు శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. అత్యంత లాభదాయకమైన పంట పామాయిల్ అని, జంతువులు, చీడ పురుగులు నష్టం చేయవని, రైతులు సాగు చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్‌లో జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులుగా ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కార్పొరేషన్ చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, మా నాల మోహన్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, జంగా రాఘవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, నగేశ్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, సీపీ సాయిచైతన్య, పసుపు బోర్డు కార్యదర్శి భవానీ శ్రీ, వ్యవసాయశాఖ డైరెక్టర్‌ఎన్ గోపి, ఉద్యానవనశాఖ కమిషనర్ యాస్మిన్ బాషా, మార్కెటింగ్‌శాఖ జేడీ మల్లేశం, డీడీ పద్మహర్ష, అనుబంధశాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఐదు జిల్లాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం



జిల్లాలో కాళేశ్వరం 20, 21, 22 ప్యాకేజీల పెండింగ్ పనులతోపాటు గుత్ప ఎత్తిపోతల పథకం మిగులు పనులకు అవసరమైన నిధులు కేటాయించి త్వరలో పూర్తి చేయిస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల పూడికతీతకు ఈనెలాఖరులోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవసరమైన చోట విరివిగా చెక్ డ్యామ్‌లు నిర్మిస్తామని అన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతాంగానికి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో వెన్నుదన్నుగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. బోనస్, రుణమాఫీ, రైతు భరోసా, ఇతర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

వేదికపై వాగ్వాదం

రైతు మహోత్సవం ప్రారంభ సభావేదికపైనే జిల్లా ఎమ్మెల్యేల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ప్రసంగిస్తూ గన్నీ బ్యాగుల కొరత ఉందని మంత్రుల దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. ఆ తర్వాత మాట్లాడిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు లేవని, బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే గన్నీ బ్యాగుల కొరత ఉందని చెబుతున్నారని అన్నారు. భూపతిరెడ్డి ప్రసంగం ముగిసిన తర్వాత రాకేశ్‌రెడ్డి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు వద్దకు వెళ్లి తనపై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇరువురు మంత్రులు రాకేశ్‌రెడ్డిని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.



రాకేశ్‌రెడ్డిని సముదాయిస్తున్న మంత్రులు

రైతులు తలెత్తుకుని తిరిగే రోజు రావాలి



రాష్ట్రంలోని ప్రతి రైతు తలెత్తుకుని తిరిగే రోజు రావాలని, పంట పండించే రైతుకు బోనస్ ఇవ్వడంతో ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలని, పెట్టుబడి ఖర్చు తగ్గించాలని, అధిక దిగుబడులు పెరగాలన్నారు. రైతులు అప్పుల నుంచి బయట పడేలా అధికారులు, ప్రభుత్వం పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పంటలకు బోనస్ ఇస్తే, రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.



స్టాల్‌ను ప్రారంభిస్తున్న షబ్బీర్, పక్కన మంత్రులు తుమ్మల, ఉత్తమ్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు పోచారం



రైతు మహోత్సవంలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన రైతులు, నాయకులు

న్యూస్‌రీల్

'వేగంగా కాంటాలు వేయాలి'



భిక్కనూరు: కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని వేగంగా కాంటాలు వేయాలని టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు భిక్కనూరు మండల కేంద్రంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలోని రికార్డులను, వడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంటాలు అయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. వారి వెంట సింగిల్ విండో అధ్యక్షుడు గంగ్గళ్ల భూమయ్య, ఉపాధ్యక్షుడు ముచ్చర్ల రాజిరెడ్డి, టాస్క్‌ఫోర్స్ అధికారులు అజయ్‌బాబు, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రావు, సుదర్శన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేశ్ ఉన్నారు.

బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అభినందన



కామారెడ్డి క్రైం: పిట్లం మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన బ్లూ కోల్ట్స్ సిబ్బంది కానిస్టేబుల్ రవిచంద్ర, హోంగార్డు మారుతిలను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారిని అభినందించి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు ప్రదర్శించే ధైర్య సాహసాలు శాఖకు గౌరవాన్ని తీసుకువస్తాయని పేర్కొన్నారు.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ సేవా శిబిరం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్‌లో గల బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ డీఈ సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఏవైనా ఫిర్యాదులు, బిల్లులకు సంబంధించిన సమస్యలు, ఇతర సేవలపై సలహాలు, సూచనల కోసం శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

'సంఘాల పనితీరు భేష్'



దోమకొండ : స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ జీవనోపాధుల డైరెక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. సోమవారం దోమకొండలో మహిళా సంఘాలు చేపడుతున్న జీవనోపాధుల కార్యక్రమాలను ఆయన డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి పరిశీలించారు. లింగుపల్లి గ్రామంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. మండల కేంద్రంలో మహిళలు నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రైజెస్‌ని సందర్శించారు. అనంతరం గ్రామ సంఘంలో ఏర్పాటు చేసిన స్టిచ్చింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. మండల సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి, భోజనం చేసి వారి పనితీరు మెచ్చుకున్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణమురళి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీపీఎం సుధాకర్, ఏపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్:ప్రాథమిక, ఉన్నతపాఠశాలల ఉపాధ్యాయులకు మండల, జిల్లా స్థాయిలలో శిక్షణ ఇవ్వడంకోసం సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్స్‌ను నియమించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఇందుకోసం అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుల శిక్షణ కోసం మండల రిసోర్స్ పర్సన్స్ -8 (తెలుగు/ఇంగ్లిష్), జిల్లా రిసోర్స్ పర్సన్స్ -10 (తెలుగు/ఇంగ్లిష్), 4 (ఉర్దూ), అలాగే స్కూల్ అసిస్టెంట్ హైస్కూల్ ఉపాధ్యాయుల శిక్షణ కోసం డీఆర్‌పీలు-36(తెలుగు/ఇంగ్లిష్)-10,(ఉర్దూ), అలాగే హెచ్‌ఎంల శిక్షణ కోసం డీఆర్‌పీలు-8 పోస్టుల భర్తీ కోసం ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంఆర్పీ పోస్టుల కోసం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో, డీఆర్పీ పోస్టుల దరఖాస్తుల కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల పరిశీలన

- త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించిన ఎంపీ సురేశ్ షెట్కార్
- మడిగెలు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయం చూపాలి: షబ్బీర్ అలీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను సోమవారం జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పరిశీలించారు. ఇంజినీర్లతో పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.40 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ రైల్వే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమీపంలో బ్రిడ్జి లేదా ఆర్‌వోబీ నిర్మించేందుకు సర్వే జరుగుతోందన్నారు. పాతరాజంపేట వద్ద కూడా రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రైల్వే స్టేషన్ ముందు భాగంలో ఇన్, ఔట్ గేట్లను ఏర్పాటు చేసే క్రమంలో ఉపాధి కోల్పోతున్న వారికి రైల్వేశాఖ నిర్మించే మడిగెలు కేటాయించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అధికారులకు సూచించారు. వారి వెంట అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వాణి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు అశోక్‌రెడ్డి, పాత రాజు, పండ్ల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట: భూభారతి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. సోమవారం పర్మళ్ల, పొల్కంపేట గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పర్మళ్ల సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటిని చట్ట ప్రకారం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను దరఖాస్తులో స్పష్టంగా రాసి అందించాలన్నారు. భూభారతి పోర్టల్‌లో భూముల రిజిస్ట్రేషన్లు, సాదాబైనామాలు, రెవెన్యూ భూ రికార్డుల్లో తప్పుల సవరణ, వారసత్వ భూములు, సర్వే నంబర్లలో తప్పులు, ఒకరి భూమి మరొకరి పేరుపై నమోదు కావడం, సర్వే నంబర్లు తప్పుగా నమోదు కావడం తదితర సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. భూ సమస్యలను జూన్ 2లోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పరిష్కారం కాని సమస్యలపై ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్,

పర్మళ్లలో 165 దరఖాస్తులు, పొల్కంపేట లో 165 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. పర్మళ్లలో 331 సర్వే నంబరులో పలువురు రైతులకు చెందిన 62 ఎకరాలు, 380 సర్వే నంబరులో మరికొంతమంది రైతులకు సంబంధించిన 96 ఎకరాలు, 400 సర్వే నంబరులో 120 ఎకరాలు సీలింగ్ భూములుగా నమోదయ్యాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వాటిపై విచారణ చేపట్టి పరిష్కార మార్గాలు చూపుతామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



పొల్కంపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం భూభారతి అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ధరణి వల్ల నష్టపోయిన వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏవో కిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

కామారెడ్డి క్రైం : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం కామారెడ్డిలోని ఆయన నివాసంలో రాజంపేట, కామారెడ్డి మండలాల పార్టీ నేతలతో సన్నాహక సభ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి గాలికి వదిలేశారని ఆరోపించారు. హామీల అమలు చేతకాక ప్రతిపక్షాలపై నోరు పారేసుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. పంట రుణాల మాఫీ, రైతుబంధు అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో మాజీ సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. బీఆర్‌ఎస్ సభకు నియోజకవర్గం నుంచి 3 వేల మంది కార్యకర్తలను తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గోపి గౌడ్, పార్టీ మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, బలవంతారావు, సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్, వైస్ చైర్మన్ రమేష్, నాయకులు మోహన్‌రెడ్డి, గూడెం బాల్‌రాజు, కమలాకర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

రుణ లక్ష్యాన్ని చేరుకోవాలి

కామారెడ్డి క్రైం: రాజీవ్ యువ వికాసం పథకం కింద బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం జూమ్ యాప్ ద్వారా బ్యాంకర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ పథకానికి 44,630 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలో 13,450 యూనిట్లను మంజూరు చేయాలన్నది లక్ష్యమన్నారు. మండలాలు, బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్ణయించి ఇప్పటికే సంబంధిత బ్యాంకర్లకు అందించామన్నారు. బ్యాంకర్లు వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. రైస్ మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలను నిర్దేశించడాన్ని వేగవంతం చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. జూమ్ మీటింగ్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఎల్‌డీఎం రవికాంత్, డీఆర్‌డీవో సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామీణ విద్యార్థులకు పట్టుదల ఎక్కువ



భిక్కనూరు: పట్టణ ప్రాంత విద్యార్థులకంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టుదల, చురుకుదనం ఎక్కువని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్టారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌ను సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే బంగారు భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. సౌత్‌క్యాంపస్ సమస్యలను వైస్‌చాన్స్‌లర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానన్నారు. అనంతరం బాలకల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, హాస్టల్ వార్డెన్లు యాలాద్రి, సునీత, అధ్యాపకులు మోహన్ బాబు, సవిత, హరిత, లలిత, అంజయ్య, నారాయణ, రమాదేవి, నర్సయ్య ఏపీఆర్‌వో సరిత పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వర్సిటీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డిని కోరారు. ఈ విషయమై వారు సోమవారం వినతి పత్రం అందించారు. ఇతర రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులకు పర్మినెంట్ చేశారని గుర్తు చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని బాలకృష్టారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణ గుప్తా, యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, శ్రీకాంత్, నిరంజన్, దిలీప్, సరిత పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

దోమకొండ : మండల కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అధికారులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఐడీపీ అధికారి కుమార్ నరసింహ, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి తదితరు లు మండల అధికారులతో కలిసి మండల కేంద్రంలోని దేవునికుంట, గుండ్ల చెరువు ప్రాంతం, ముత్యంపేట రోడ్డు ప్రాంతాలలోని స్థలాలను పరిశీలించారు. అనంతరం స్థానిక అధికారులతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులతో ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సంజయ్‌రావ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు తిరుమల్‌గౌడ్, స్వామి, మధుసూదన్, రామస్వామిగౌడ్, తదితరులున్నారు.

తెయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 28 నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ 1, 3, 5 వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం, ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల నిర్వహణకు నిరాకరించడంతో వాయిదా వేసినట్లు సమాచారం.

ఆగని అత్తింటి వేధింపులు

- ఉద్యోగం చేస్తున్నా తప్పని తిప్పలు
- అనుమానాలతో క్షోభకు గురిచేస్తున్న వైనం
- ఉమ్మడి మాచారెడ్డి మండలంలో పెరుగుతున్న వరకట్న వేధింపు కేసులు



మాచారెడ్డి: అందమైన దాంపత్య జీవితంలో వరకట్నం చిచ్చుపెడుతోంది. అన్యోన్యంగా సాగాల్సిన కాపురం అనుమానాలతో కలహాల కాపురంగా మారుతోంది. పెద్దల సమక్షంలో పంచాయతీలు, పోలీసులు కౌన్సెలింగ్ చేసినా దంపతులు మధ్య సఖ్యత కుదరడం లేదు. ఉమ్మడి మాచారెడ్డి మండలంలో వరకట్న వేధింపులు రోజు రోజుకు అధికమవుతున్నాయి. ఏడాది కాలంలో పది వరకట్న వేధింపుల కేసులు నమోదయ్యాయి. పలువురికి పోలీసులు కౌన్సెలింగ్ చేసి పంపించినా మళ్లీ కొద్ది రోజులకు అత్తింటి వాళ్ల వేధింపులకు గురి చేయడంతో కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నారు. పిల్లలు పుట్టిన తర్వాత కూడా వర కట్న వేధింపులు తప్పడం లేదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం చేస్తున్నా పలువురు అనుమానాలతో వేధింపులకు గురి చేస్తుండగా, మరి కొందరు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి.

ఉమ్మడి మాచారెడ్డి మండలంలో జరిగిన ఘటనలు ..

- పాల్వంచ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని కామారెడ్డి పట్టణానికి చెందిన యువకుడికి 2006వ సంవత్సరంలో ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. లాంఛనంగా 10తులాల బంగారం ఒప్పుకొని పెళ్లి సమయంలో 5తులాల బంగారం ఇచ్చి మరో 5తులాలు పదేళ్ల తర్వాత ఇస్తామని ఒప్పుకున్నారు. ఒప్పుకున్న విధంగా ఇంకో తులం బంగారం కలిపి మొత్తం 11తులాల బంగారం ముట్టజెప్పారు.గత కొన్నేళ్లుగా భర్త,అత్త అదనపు కట్నం కోసం వేధించసాగారు. అంతటితో ఆగకుండా మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే తన భర్త మరో వివాహం చేసుకున్నట్టు బాధితురాలు ఇటీవల ఠాణా మెట్లెక్కింది.
- మండలంలోని సోమారంపేటకు చెందిన యువతిని ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ కు చెందిన యువకుడికి ఇచ్చి నాలుగేళ్ల కిందట వివాహం జరిపించారు.అప్పుడు లాంఛనంగా రూ.లక్ష రూపాయల నగదు, 11 తులాల బంగారం కట్నంగా ముట్టజెప్పారు. ఓ కుమారుడు పుట్టేంత వరకు ఆ దంపతులు అన్యోన్యంగా ఉన్నారు.కొద్ది రోజుల తర్వాత ఆ యువతి టీచర్ ఉద్యోగం సాధించింది.అప్పటి నుంచి అనుమానాలతో వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- పాల్వంచ మండలం ఆరెపల్లికి చెందిన యువతిని 11 ఏళ్ల క్రితం ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన యువకుడికి ఇచ్చి పెళ్లి జరిపించారు.లాంఛనంగా కట్నకానుకలు అప్పజెప్పారు.ఓ కుమారుడు పుట్టాక అదనపు కట్నం కోసం భర్త వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు.ఒక సారి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడినా మార్పు రాకపోవడంతో ఆ వివాహిత పోలీసులను ఆశ్రయించింది.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం



వరకట్నంతో ఇతర కారణాలతో మహిళలను వేధిస్తున్న కేసులలో ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. కౌన్సెలింగ్ తో పరిష్కారం కాని కేసులను కోర్టుకు పంపిస్తున్నాం.ఎవరైనా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్షార్హులవుతారు.

– ఎస్.అనిల్, ఎస్సై, మాచారెడ్డి

‘భద్రత’తో పోలీసు కుటుంబాలకు భరోసా

- ఎస్పీ రాజేష్ చంద్ర



చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: భద్రత పథకం కింద మృతి చెందిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామన్ అనే కానిస్టేబుల్ కుటుంబానికి మంజూరైన రూ. 8 లక్షల పోలీసు భద్రత చెక్కును సోమవారం కుటుంబ సభ్యులకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రావాల్సిన సదుపాయాలను వీలైనంత త్వరగా ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో అఫ్సరుద్దీన్, సూపరింటెండెంట్ నయీం, సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగులు, ఆన్‌లైన్ గేమ్‌లపై ఉక్కుపాదం

లింగంపేట(ఎల్లారెడ్డి): బెట్టింగులు, ఆన్‌లైన్ గేమ్‌లపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ రాజేశ్ చంద్రం వెల్లడించారు. సోమవారం ఆయన లింగంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో క్రికెట్ బెట్టింగులు పెరగడంతో వాటిపై నిఘా పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ. 73 లక్షలు పోగొట్టుకున్నట్లు తెలిపారు. అలాగే కల్తీ కల్లులో అల్ప్రాజోలం వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన కొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మత్తు మందులు గుర్తించడానికి టెస్టింగ్ కిట్లు వచ్చాయని, ల్యాబ్‌కు పంపకుండానే ఎంత మేరకు మత్తు మందు కలిపారనేది తెలిపోతుందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని హైవేలపై వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు తగు చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ఎస్పీ రాజేష్‌చంద్ర పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. దీంతోపాటు సిబ్బందికి సంబంధించి శిథిలమైన క్వార్టర్స్‌ను ఆయన పరిశీలించారు. స్టేషన్‌లోని పలురికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రాత్రివేళ జరిగే నేరాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. నివారణ కోసం గ్రామాల్లోని యువతతో బృందాలను ఏర్పాటుచేసి రాత్రివేళ గస్తీ తిరిగేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో రోడ్డుప్రమాదాల సంఖ్య కూడ ఎక్కువగా ఉందన్నారు. ఈ యేడు గడిచిన నాలుగునెలల్లో ఇప్పటివరకు సుమారు 70మంది మృతిచెందారన్నారు. హైవేలపై వాహనాల వేగానికి కళ్లెం వేసేలా స్పీడ్‌కంట్రోలర్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దీంతోపాటు ఎన్‌హెచ్-44తోపాటు మెదక్ నుంచి ఎల్లారెడ్డిమీదుగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న హైవేపై స్పీడ్‌గన్‌లను ఏర్పాటు చేయించి రోడ్డుప్రమాదాలను తగ్గిస్తామన్నారు. జిల్లాలో మనీలాండరింగ్ ఎక్కువగా జరుగుతుందన్నారు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన దాడులలో 63మంది వడ్డీ వ్యాపారులను తనిఖీచేసి వారిలో 19మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో అర్ధాంతరంగా నిలిచిపోయిన బ్యారక్ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టి దానిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఆయనవెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సైలు మల్లారెడ్డి, వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్
- ప్రజావాణికి 108 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 108 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సంబంధిత ఫిర్యాదులే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించాలన్నారు. వాటిని పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. తీసుకున్న చర్యలపై ఫిర్యాదుదారునికి సమాచారం ఇవ్వాలన్నారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని సూచించారు. ధరణి ఫైళ్లు ఆన్‌లైన్‌లో మాత్రమే వస్తున్నాయనీ, తహసీల్దార్లు మ్యానువల్ ఫైళ్లను పంపడం లేదని, వెంటనే పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూద్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్



ఏసీబీకి పట్టుబడిన పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని పంచాయతీ రాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్ శ్రీనివాస్ శర్మ రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. డొంకేశ్వర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు సంబంధించిన రూ.4 లక్షల 75 వేల బిల్లుల మంజూరు చేసేందుకు రూ.7,500 ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను శ్రీనివాస్ డిమాండ్ చేసాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళిక ప్రకారం సోమవారం కాంట్రాక్టర్ రూ.7 వేలు ఇవ్వగా తీసుకుంటున్న శ్రీనివాస్ శర్మను పట్టుకున్నట్లు డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరించారు. విచారణ పూర్తయిన అనంతరం నిందితుడిని హైదరాబాద్ నాంపల్లి కోర్టుకు తరలిస్తామని డీఎస్పీ వివరించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



రాస్తారోకో చేస్తున్న గాంధీనగర్ గ్రామస్తులు

లింగంపేట: తాగునీటి కోసం గాంధీనగర్‌వాసులు ఆందోళనకు దిగారు. కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరుబావిలో నీరు అడుగంటిందన్నారు. మరికొన్ని పైపులు దించితే నీరు అందించే అవకాశం ఉన్నా నిధుల కొరతతో పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమీపంలోని వ్యవసాయ బోరుబావులలోనూ నీరు అడుగంటడంతో నీటికోసం అవస్థలు పడుతున్నామన్నారు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. సమస్య పరిష్కరించాలంటూ సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీవో గ్రామానికి వచ్చి మాట్లాడారు.

తాగునీరు సరఫరా చేయిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఎంపీడీవో వెంటనే మరో ట్యాంకరు ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేశారు. అలాగే మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అటకాయించి గొడ్డలితో దాడి

- యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న కుమార్

మాచారెడ్డి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అటకాయించి గుర్తుతెలియని దుండగులు ఇనుపరాడ్లు, గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. ఈఘటన సోమవారం ఫరీదుపేట, దోమకొండ శివారులో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు .. మండలంలోని ఘన్‌పూర్(ఎం) గ్రామానికి చెందిన సాడెం కుమార్ తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే తన బైక్‌పై ఫరీదుపేట మీదుగా దోమకొండ వైపు వెళ్తున్నాడు. ఫరీదుపేట, దోమకొండ గ్రామాల శివారులో రెండు బైకులు, ఒక ఆటోలో దుండగులు అతడిని వెంబడించి ఇనుపరాడ్లు, గొడ్డలితో తలపై బాదారు. కుమార్ రోడ్డు పక్కన కుప్పకూలిపోయాడు. అదే సమయంలో దోమకొండ వైపు నుంచి ఫరీదుపేటకు కారులో వస్తున్న పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అతడిని గమనించి కారు ఆపాడు. దీంతో దుండగులు దోమకొండ వైపు పారిపోయారని ఎస్సై తెలిపారు. కుమార్‌కు తలపై నాలుగు చోట్ల గాయాలు కావడంతో అంబులెన్స్‌లో కామారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పథకం ప్రకారం దాడి జరగడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్‌లో తప్పిపోయిన భర్తను వెతికించండి

- ప్రజావాణిలో భార్య వినతి



రామారెడ్డి: గల్ఫ్‌లో తప్పిపోయిన భర్తపై భార్య ఆవేదన చెందుతోంది. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె వినతి పత్రం అందజేసింది. వివరాల్లోకి వెళ్తే.. రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఎగ్గిని బక్క మల్లవ్వ భర్త బక్క మల్లయ్య ఉపాధి నిమిత్తం పదేళ్ల కింద రూ. లక్ష అప్పు చేసి ముంబయి నుంచి మస్కట్ దేశానికి వెళ్లాడు. ముంబయి విమానాశ్రయానికి బయలుదేరే ముందు భర్త ఫోన్‌లో మాట్లాడిందే చివరి మాట అని బక్కమల్లవ్వ ‘సాక్షి’తో తెలిపారు. తన భర్త ఆచూకీ కనిపెట్టి ఇండియాకు రప్పించాలని, లేనిచో తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారికి రూ.5 లక్షల నష్టపరిహారం ఇస్తున్న నేపథ్యంలో అందించాలని ప్రజావాణిలో వినతి ప్రతం అందించినట్లు ఆమె తెలిపారు.

క్రైం కార్నర్

టేకుచెట్ల నరికివేతపై విచారణ



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో టేకు చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులు సోమవారం విచారణ నిర్వహించారు. వార్డెన్ శారదను అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్‌వో ఓంకార్ టేకు చెట్ల నరికివేత గురించి వివరాలు సేకరించారు. హాస్టల్‌లో కోతులు విద్యార్థులపై దాడులు చేస్తుండడంతో చెట్లను నరికివేయించినట్లు వార్డెన్ తెలిపారు. అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికినందున అటవీశాఖ చట్టం కింద కేసు నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. స్ట్రైకింగ్ ఫోర్స్ డీఆర్‌వో అనురంజని, ఎల్లారెడ్డి డీఆర్‌వో శ్రీనివాస్‌నాయక్ తదితరులున్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం దానం



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన చెల్లల గంగారాం (65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు గంగారాం మృతదేహాన్ని నిజామాబాద్ మెడికల్ వైద్య కళాశాలకు దానం చేశారు. జుక్కల్ మండలం దోస్‌పల్లి తెలంగాణ ఉప పీఠం జగద్గురు రామానంద ఉపదేశాల మేరకు కుటుంబసభ్యులు మృతదేహాన్ని వైద్య విద్యార్థుల శిక్షణ కోసం అప్పగించారు. జగద్గురు స్వామిజీ భక్తులు ఇప్పటి వరకు 94 శవాలను మహారాష్ట్ర, తెలంగాణలోని ఆయా జిల్లాలో మెడికల్ వైద్య కళాశాలకు దానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మాందు జీవన్ (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గాంధారి–లింగంపేట్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. చద్మల్ తండాకు చెందిన మాందు జీవన్(45) సోమవారం బైక్‌పై రాంలక్ష్మణ్‌పల్లి వైపు నుంచి గుర్జాల్‌తండా వైపు బయలుదేరాడు. బ్రాహ్మణ్‌పల్లి స్టేజీ సమీపంలో అతడి బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కమలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టులో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. వివరాలు ఇలా.. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రాంతంలో అబ్దుల్ సలాం (37) నివసిస్తుండేవాడు. అతడి భార్య ఏడాది క్రితం మృతిచెందడంతో ఆమె తల్లితరపువారు సలాంపై కేసు వేశారు. దీంతో సలాం జైలుకు వెళ్లగా ఇటీవల బయటకు వచ్చాడు. తన పిల్లలను చూడడానికి అత్తగారింటికి వెళ్లిన సలాంను వారు అడ్డుకోవడంతో మనస్థాపం చెందాడు. దీంతో సలాం వాట్సప్ స్టేటస్ పెట్టి, నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్ని మండలంలో..

వర్ని: మండలంలోని చందూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. చందూర్ గ్రామానికి చెందిన అర్కల గోపాల్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులు భరించలేక సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముప్కాల్ మండలంలో..



గంగాధర్ (ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండలంలో ఓ వ్యక్తి ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా.. నాగంపేట్ గ్రామానికి చెందిన ఏలేటి గంగాధర్ అలియాస్ వకీల్ (49) కొంతకాలంగా తనకు ఎవరో మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో మానసికంగా బాధపడుతున్నాడు. మానసిక ప్రశాంతత కోసం ఈనెల 15న గ్రామస్తులతో కలిసి తిరుపతిలో శ్రీవారి సేవ చేయుటకు వెళ్లాడు. గంగాధర్ నిత్యం కల్లు తాగే అలవాటు ఉంది. తిరుపతిలో కల్లు లభించకపోవడంతో మానసిక ఆందోళనకు గురై ఆదివారం గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో పురుగులమందు తాగాడు. అనంతరం కొత్తపల్లికి గ్రామంలో ఓ ఇంటి వద్ద నీరు తాగి అక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆర్మూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తాడ్వాయి మండలంలో..

తాడ్వాయి (ఎల్లారెడ్డి): మండలంలోని కాళోజివాడిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజయ్య తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మల్లమారి రాకేష్ (25)కు ఐదేళ్ల క్రితం రామారెడ్డి మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన సంధ్యతో వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమారుడు అనూష్ ఉన్నాడు. రెండేళ్లుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో ఇటీవల సంధ్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి రాకేష్ తీవ్ర మనస్థాపంతో బాధపడుతుండేవాడు. కాగా సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమి వద్ద గల వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

30 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ నిందితులు, గంజాయితో ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి, సిబ్బంది

ఖలీల్‌వాడి: ఎండుగంజాయి తరలిస్తున్న ఐదుగురిని పట్టుకుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని గంజ్ ప్రాంతంలో ఆటోనగర్‌కు చెందిన మొహమ్మద్ ఆయూబ్ వద్ద గంజాయి ఉన్నదనే సమాచారం మేరకు అతని వద్ద తనిఖీ చేయగా 250 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొహమ్మద్ ఆయూబ్‌ను విచారించగా మహారాష్ట్ర, నాందేడ్‌లోని బోకార్‌కు చెందిన ఫరూక్‌ఖురేషీ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి నవీపేట్ మండలం యంచ వద్ద ఫారూఖ్‌ఖురేషీతోపాటు నాందేడ్‌లోని బోకార్‌కు చెందిన యషేక్ ఫయీమ్, షేక్ సిద్ధిక్, జుబేర్ పఠాన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి కారులో తనిఖీలు చేయగా అందులో 30కిలోల ఎండుగంజాయి దొరికినట్లు తెలిపారు. ఫారూక్‌ఖురేషీ ఆంధ్ర, ఛత్తీష్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నుంచి ఎండుగంజాయిని కొనుగోలు చేసి నిజామాబాద్, నాందేడ్ చుట్టుపక్కల ప్రాంతాలలో అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. 30.250 కిలోల ఎండు గంజాయి విలువ రూ.6లక్షల వరకు ఉంటుదన్నారు. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి కారు, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, ఎస్సై రాంకుమార్, సిబ్బంది హమీద్, రాజన్న, రాంబచన్, సుకన్య, ఆశన్న, అవినాష్, శ్యాం సుందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు

ఖలీల్‌వాడి: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి, ఒకరి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు నిజామాబాద్ సెకండ్ అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాస్ ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా.. 2018లో చిలుకల సాయిలు అనే వ్యక్తి తన బైక్‌పై నిజామాబాద్ నుంచి ముబారక్ నగర్ వెళ్తుండగా వెనక నుంచి ఆర్టీసీ బస్సు వచ్చి అతడిని ఢీకొట్టింది. ఈఘటనలో సాయిలు మృతిచెందడంతో పోలీసులు ఆర్టీసీ డ్రైవర్ గణపతిపై కేసు నమోదు చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే వ్యక్తి మృతిచెందినట్లు కోర్టులో రుజువు కావడంతో నిందితుడికి ఏడాది పాటు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.